క్లుప్తంగా

సహజ నటుడు కైకాల



విజయవాడ కల్చరల్: సహజ నటుడు కైకాల సత్యనారాయణ అని మహానటి సావిత్రి కళా పీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం సినీ నటుడు, నిర్మాత కైకాల సత్యనారాయణ జయంతి సభను నిర్వహించారు. సభలో ఆమె మాట్లాడుతూ నటుడు సత్యనారాయణ ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడన్నారు. సత్యనారాయణను రఘుపతి వెంకయ్య అవార్డుతో సత్కరించాలని కోరారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఆయన ప్రజాసేవలో మమేకమై జీవించినట్లు తెలిపారు. చింతకాయల చిట్టిబాబు, ఎమ్‌వీ మంగపతి, జయప్రభ పాల్గొన్నారు.

కట్టుకథలతో విద్వేషాలు రగిలించొద్దు

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లింలను ద్రోహులుగా చూపించిన హరిహర వీరమల్లు చిత్ర ప్రదర్శనను నిలిపివేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాల్పనిక కథ అయిన ఈ చిత్రంలో ప్రజలకు అవాస్తవాలను చూపించారని, ముస్లిం వ్యతిరేక విద్వేషాలు పెరగడానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. కట్టుకథలతో ప్రజల్లో విద్వేషాలు రగిలిస్తే అది దేశ సమగ్రతకు చేటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లూనాసెంటర్ ఫీడర్‌లో వార్షిక తనిఖీలు, మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ యార్డ్‌రోడ్డు, లూనాసెంటర్, ఎంకే బేగ్ స్కూల్, చల్లగాలి ఐజయ్య వీధి, లెనిన్‌సెంటర్, డాబాకొట్లు సెంటర్, రైల్వే ట్రాక్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ధర్మస్థల హత్యోదంతంపై దర్యాప్తును వేగవంతం చేయాలి

ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల వెలుగులోకి వచ్చిన కర్ణాటకలోని ధర్మస్థలం సమీపంలో వందలాది మంది యువతులు, మహిళలపై అత్యాచారం, హత్యోదంతం ఘటనలపై దర్యాప్తును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. విజయవాడ మహిళా సమాఖ్య కార్యాలయం దాసరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఈ నెల 28న ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, కౌన్సిల్ సభ్యులు ఓర్సు భారతి, బంక ఝాన్సీ, దుగ్గిరాల సీతారావమ్మ, భాగ్యలక్ష్మి, కే శైలజ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడీపేటకు దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమార్తె(17) భవానీపురంలోని ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 22వ తేదీ రాత్రి ఇంట్లో అందరూ భోజనాలు చేసిన తర్వాత నిద్రపోయారు. రాత్రి 11.30 గంటల సమయంలో నిద్రలేచిన మైనర్ తండ్రికి పక్కనే పడుకున్న కుమార్తె కనిపించలేదు. దీంతో బయటకు వచ్చి చూడగా బాలిక జాడ లేదు. బాలిక గతంలోనూ ఓ యువకుడితో వెళ్లిపోగా తీసుకువచ్చారు. ఈసారి కూడా అలాగే వెళ్లిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

త్రిశక్తి పీఠంలో మంగళ, శుక్రవారాల్లో సామూహిక కుంకుమార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో విశ్వావసు నామ సంవత్సర శ్రావణ మాసంలో ప్రతి మంగళవారం, శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు బంగారు పుష్పాలతో పుష్పార్చన చేస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 8వ తేదీన 9.30గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రాణాలు పోతే తప్ప స్పందించరా..?

- సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వీధికుక్కలు, పందులు స్వైర విహారం
- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన అధికార యంత్రాంగం
- ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోని వైనం



నందమూరినగర్‌లో నివాసాల ముందు సంచరిస్తున్న పందులు



తోటవారి వీధి మెయిన్ రోడ్డులో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సింగ్‌నగర్, నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు, పందుల సమస్య తీవ్రంగా ఉంది. పదుల సంఖ్యలో రోడ్లపై, నివాసాల ముందు గుంపులుగా చేరి స్థానిక ప్రజలను, ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఎక్కడ చూసినా కుక్కల దాడుల్లో మృతిచెందిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వరుస సంఘటనలు జరుగుతున్నా... పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివాసాల ముందు పందుల బీభత్సం

స్థానిక 57, 58, 59, 60వ డివిజన్‌లు పందులకు నివాస ప్రాంతాలుగా మారాయి. ఈ డివిజన్‌లలోని నందమూరినగర్, ఇందిరానాయక్‌నగర్, తోటవారి వీధి, భారతమాత మందిరం రోడ్డు, సన్ సిటీ కాలనీ, షణ్ముఖ నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, అమరావతి కాలనీ ప్రాంతాల్లో రోడ్లపై, నివాసాల ముందు పదుల సంఖ్యలో పందులు సంచరిస్తున్నాయి. తమ ఇళ్ల ముందు పందులు విపరీతంగా సంచరిస్తున్నాయని వీటి వల్ల తమకు ఎప్పుడు ఏ వ్యాధులు సంభవిస్తాయోనని భయంగా ఉందని.. వీటి భారి నుంచి తమకు విముక్తి కలిగించాలని స్థానిక ప్రజలు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. అయిన ఒక్కరు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. పందుల పెంపకందారుల నుంచి కొంత మంది అధికారులు మామూళ్లు వసూళ్లు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేశారని స్థానిక ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.

రోడ్లపై నడవాలంటే హడలు

స్థానిక 57, 58, 59, 60వ డివిజన్లలో వీధికుక్కల సమస్య కూడా తీవ్రంగా ఉంది. పదుల సంఖ్యలో వీధికుక్కలు గుంపులు గుంపులుగా ఇక్కడ సంచరిస్తున్నాయి. ఇవి నిత్యం రోడ్లపై చేరి ఒంటరిగా రాకపోకలు సాగించే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. ప్రధానంగా చిన్నపిల్లలు, మహిళలు రోడ్లపైకి ఒంటరిగా రావాలంటేనే భయపడిపోతున్నారు. రాత్రుల సమయంలో ఇవి బైకులపై వెళ్లే వారిపై వెంటపడి గాయాలపాలు చేస్తున్నాయని వాపోతున్నారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్, భారతమాత మందిరం రోడ్డు, నందమూరినగర్, తోటవారివీధి, లూనాసెంటర్, ఇందిరానాయక్‌నగర్ ప్రాంతాల్లో వీధికుక్కల సమస్యలు అధికంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్థానిక ప్రజలు, ప్రయాణికుల పాలిట శాపంగా మారిన వీధికుక్కలు, పందుల సమస్యలను పరిష్కరించి వాటి భారి నుంచి తమకు విముక్తి కలిగించాలని ప్రాధేయపడుతున్నారు.



భారతమాత మందిరం రోడ్డులో ఇళ్ల ముందు వీధికుక్కలు

కోట మృతి సినీ రంగానికి తీరని లోటు

మంత్రి సత్యకుమార్ యాదవ్



కోట సంస్మరణ సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

విజయవాడ కల్చరల్: సినీ నటుడు, బీజేపీ నాయకుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగంతో పాటు రాజకీయ రంగానికి తీరని లోటు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే, సినీ నటుడు కోట శ్రీనివాసరావు సంస్మరణ సభను ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని కల్యాణ మండపంలో నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కోట 40 ఏళ్లపాటు సినీ రంగంలో తనదైన ముద్రవేసుకున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలను బలంగా నమ్మిన వ్యక్తి కోట శ్రీనివాసరావు అని అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విలక్షణ నటుడు కోట అని అభివర్ణించారు. సినీ నటుడు మోహన్‌బాబు ఫోన్ ద్వారా సంతాప సందేశం పంపించారు. బీజేపీ నగర అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం సభకు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, బీజేపీ నాయకులు బిట్రా శివన్నారాయణ, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, కొలపల్లి గణేష్, షేక్‌బాజీ, అభిమానులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న నాగేశ్వరశర్మ, వాద్య సహకారం అందిస్తున్న నందకుమార్, చదలవాడ సూర్య తదితరులు

విజయవాడ కల్చరల్: స్వరఝురి సంగీత సంస్థ ఆధ్వర్యంలో విఖ్యాత సంగీత విద్వాంసుడు సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం యువ సంగీత కళాకారుడు గండూరి నాగేశ్వర శర్మ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సర్వజన సమ్మోహనంగా సాగింది. వర్ణంతో ప్రారంభించి దేవ దేవ, కామాక్షి స్వరజతి, పంకజలోచన, పట్టి విడువరాదు, రామకథా సుధ, శంకరగిరి తదితర కీర్తనలను ఆలపించారు. పెరవలి నందకుమార్ వయోలిన్‌పై, చదలవాడ సూర్య మృదంగంపై సహకరించారు. స్వరఝురి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ సెమ్మంగుడి సంగీత సేవలను వివరించారు. అంజనా సుధాకర్, గండూరి శ్రీనివాసమూర్తి, పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఎంజీరోడ్డులోని ఈట్ స్ట్రీట్, వేముల శ్యామలాదేవి రోడ్డు, కర్నాటి రామ్మోహన్ స్కూల్ వీధి, విశాలాంధ్ర రోడ్, బీఆర్టీఎస్ రోడ్, సీకే రెడ్డి రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. శాతవాహన కాలేజీలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లను ఒకటి కర్నాటి రామ్మోహనరావు స్కూల్లో, మూడింటిని ఎస్ఆర్ఆర్ కాలేజ్‌లో ఏర్పాటు చేసేందుకు ఏఆర్వోలు, సెంట్రల్ తహసీల్దార్ ప్రతిపాదించగా ఈ సందర్భంగా వాటిని ఆయన పరిశీలించారు. ఈట్ స్ట్రీట్‌లో నిరంతరం డీసిల్టింగ్ పనులను చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం ఉండకూడదన్నారు. ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్‌ను కచ్చితంగా నిషేధించాలని, ఇందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బృందాలు నగరంలో విస్తృతంగా పర్యటించాలని అధికారులను ఆదేశించారు. కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్ రోడ్లో పర్యటించి అక్కడ ప్రహరి సరిగా లేకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు ఆ గోడను పునర్నిర్మించాలని, స్థానికంగా ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను అక్కడి నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు.

విశాలాంధ్ర రోడ్డులో పర్యటించి నగర సుందరీకరణలో భాగంగా డివైడర్లలో గ్రీనరీని పెంచాలని, రంగులు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏఈఆర్వోలు, పర్యవేక్షణ ఇంజినీర్ ప్రాజెక్ట్ పి.సత్యకుమారి, సెంట్రల్ డెప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానం మహాదానం అని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యాన రక్తదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటికీ రక్తం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య గణనీయంగా ఉందన్నారు. అవకాశం, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి, కోఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ సరే.. ఆక్రమణల మాటేమిటి..?



రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో నూతనంగా వెలిసిన బడ్డీకొట్టు



ఫెన్సింగ్ లోపల పశువులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో ఇటీవల బుడమేరు పక్కన ఫెన్సింగ్ వేశారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే ఫెన్సింగ్ పక్కనే నూతనంగా బడ్డీలు, దుకాణాలు ఏర్పాటు చేసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ ఫెన్సింగ్ వేసిన కూడా బుడమేరు లోపల కొంత మంది వారి పశువులను కట్టేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. విలువైన ప్రజాధనంతో ఫెన్సింగ్ ఎవరి కోసం ఏర్పాటు చేశారో అధికారులకే తెలియాలని స్థానికులు అంటున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసే సమయంలో కూడా ఇక్కడ ఉన్న ఆక్రమణలను పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటీవల ఇక్కడ రోడ్డు పక్కన నూతనంగా బడ్డీలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పన్నుల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి



పాతపాడు గ్రామంలో రికార్డులు పరిశీలిస్తున్న డెప్యూటీ ఎంపీడీఓ ఎంవీడీ ప్రసాద్

విజయవాడరూరల్: గ్రామాల్లో ఇంటిపన్ను వివరాలను నెలాఖరు నాటికి ఆన్‌లైన్‌లో తప్పుల్లేకుండా నమోదు చేయాలని విజయవాడ రూరల్ మండల డెప్యూటీ ఎంపీడీఓ ఎంవీడీ ప్రసాద్ సూచించారు. శుక్రవారం పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో జరుగుతున్న పన్నుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్ను, నీటి పన్ను, గ్రంథాలయ పన్నుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నట్టు తెలిపారు. పాతపాడు గ్రామంలో 1,360 అస్సెస్‌మెంట్లకు గాను రూ. 18.60 లక్షలు పన్నుల రూపంలో ఆదాయం వస్తుందన్నారు. పి.నైనవరం గ్రామంలో 1,163 అస్సెస్‌మెంట్లకు గాను రూ. 15.20 లక్షలు, అంబాపురం గ్రామంలో 1,740 అస్సెస్‌మెంట్లకు గాను రూ. 42 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఈ మూడు గ్రామాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ వివరాలను డెప్యూటీ ఎంపీడీఓకి గ్రామ పంచాయతీ కార్యదర్శులు పి.కోటిలింగమ్మ, అజేంద్ర, డి.శ్రీనివాసరావు వివరించారు.

వరలక్ష్మిదేవిగా శ్రీకామాక్షి అమ్మవారు



చినకంచిలో కామాక్షి అమ్మవారికి వరలక్ష్మి అలంకారం

నున్న(విజయవాడరూరల్): నున్న, పరిసర గ్రామాల్లోని దేవాలయాల్లో తొలి శ్రావణ శుక్రవారం పూజలు, అభిషేకార్చనలు నిర్వహించారు. నున్న గ్రామంలో చినకంచిలో శ్రీకామాక్షి అమ్మవారికి విశేషంగా వరలక్ష్మీదేవిగా అలంకారం చేసి ప్రతిష్ఠించి వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ప్రత్యేక అభిషేక అర్చనలు చేశారు. అనంతరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టలక్ష్ములకు అభిషేక అర్చనలు నిర్వహించారు. 3వ శుక్రవారం సువాసినిలచే వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు. శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో శ్రావణ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి మహిళలు పూజలు నిర్వహించారు. దేవదాయశాఖకు చెందిన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు అర్చనలు చేశారు. శ్రీచక్రనానికి కుంకుమపూజలు చేశారు. శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో కూడా పూజలు జరిగాయి. పి.నైనవరం గ్రామంలో నాగేంద్రస్వామి దేవస్థానం, అంబాపురం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేసిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బాలుడిపై శుక్రవారం కేసునమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సంయుక్తరాణి కంకిపాడులోని విష్ణాలయం సమీపంలో నివాసం ఉంటోంది. ఆమె ఉంటున్న ఇంటికి పక్క పోర్షన్‌లో వ్యక్తికి స్నేహితుడైన బాలుడు మద్యం తాగి అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి అష్టబంధన మహోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న టీటీడీ అధికారులు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 31వ తేది వరకు టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన, మహాసంప్రోక్షన, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్వీఎస్ గ్రూప్ టెంపుల్ సూపరింటెంట్ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శనివారం ఆచార్యవరణం, అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 27వ తేది అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, 28న నవగ్రహారాధన, కుంభారాధన, 29న సర్వ శాంతిహోమం, 30న మహాశాంతి హోమం, 31న మహాపూర్ణాహుతి నిర్వహిస్తునట్లు వివరించారు. అర్చక స్వాములు మురళి, శశికిరణ్ మాట్లాడుతూ తిరుపతి నుంచి వేదపండితులు వైఖానస ఆగమోత్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం దీనికి సంబంధించి పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. టీటీడీ అధికారులు లలితా రమాదేవి, నాగభూషణం, విజయకుమార్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే



ర్యాలీలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దోమల నివారణకు ఫ్రైడే డ్రై డే నిర్వహణతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం పూర్ణనందపేటలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానికుల ఇళ్లలో నీటి నిల్వలను పరిశీలించి వాటితో జరిగే అనర్థాలను వివరించారు. స్థానికంగా యాంటీ లార్వా ఆపరేషన్లు చేయాలని, దోమకాటుతో ఎదురయ్యే ఇబ్బందులను స్థానికులకు తెలియజేశారు. సైడ్ డ్రెయిన్లలో పూడికలు తీయడం, ఎమెల్ ఆయిల్స్ స్ప్రే చేయడం కల్వర్టుల వద్ద ఫాగింగ్ చేయడం వంటి యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బయోలజిస్ట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం



ముత్యాలంపాడులో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం శ్రావణమాస పూజలు ప్రారంభం అయ్యాయి. ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయం, సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శ్రీశివకేశవ దేవాలయం, రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి అమ్మవారి దేవాలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, మధురానగర్ స్వయంభూ శ్రీబాలసుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలి



జిల్లా కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

విజయవాడలీగల్: రాష్ట్రంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలని, న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్ కోర్టుల ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కోర్టు భవనాలు నిర్మించాలని కోరారు. న్యాయమూర్తుల సంక్షేమ నిధి రూ. 6 నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఇవ్వవలసిన మ్యాచింగ్ గ్రాంటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదరికంలో ఉన్న న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అలాగే హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బాషా పాల్గొని న్యాయవాదులు చేపట్టిన కార్యక్రమాలకు వెన్నంటి ఉంటామని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎల్ ఉప ప్రధాన కార్యదర్శి ఎంఏ షరీఫ్, ఉపాధ్యక్షులు కేవీవీ పరమేశ్వరరావు, కేఎస్ సుధాకరరాజు, కోశాధికారి బోను జయమ్మ, సహాయ కార్యదర్శి ఈఎస్ ప్రసాద్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు అమలాపురానికి చెందిన కళాకారులు నృత్యార్చన చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై రామాంజనేయ డ్యాన్స్ అకాడమికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారుల నృత్యార్చనను వీక్షించి అభినందించారు. నాట్యాచార్య ఎన్. దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో 20 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.